క్లుప్తంగా

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మి

కొండపి: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలిచ్చి ఇంతవరకు ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎలమంద, ఆశీర్వాదం, రమణమ్మ, కుమారి, రమణ, రూపిక, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగాసనాలు చేస్తున్న సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్‌కుమార్, సిబ్బంది

కొండపి: యోగాతో ఆరోగ్యం మెరుగుపడుతుందని కొండపి సీఐ సోమశేఖర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఉదయం యోగా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ యోగా, వ్యాయామం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సిబ్బందికి క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్, మర్రిపూడి ఎస్సై రమేష్, సర్కిల్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

పామూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు. అదేవిధంగా అన్ని శాఖల అధికారులు సంబంధిత వివరాలతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

రోగులకు ఉచితంగా భోజనం



భోజనం పెడుతున్న స్నేహ హస్తం ప్రతినిధులు

కనిగిరి రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, రోగి సహాయకులకు స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు సుధీర్‌బాబు మాట్లాడుతూ వారంలో ఒక రోజు గర్భిణులకు, డయాలసిస్ పేషంట్లకు వ్యాధిగ్రస్తులకు, పేదలకు కూడా తమ సంస్థ ద్వారా ఆహారం అందజేస్తున్నట్లు తెలిపారు. శంకర్, గోసిశెట్టి బాలచెన్నయ్య, సర్పంచ్ దమ్ము వెంకటయ్య, మోహన్‌కుమార్, బేబీరాజ్, ఖాశిం, పీరా, విజయ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ కృపావరం

హనుమంతునిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని, సమయపాలన పాటించని కార్యకర్తలపై శాఖాపరమైన చర్యలు తప్పవని వెలిగండ్ల ప్రాజెక్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృపావరం హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్తల సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంటర్లలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు. సూపర్‌వైజర్ షేక్ గౌసినీసా బేగం, కార్యకర్తల అధ్యక్ష, కార్యదర్శులు రాధ, సరస్వతి, లలితమ్మ, శోభ, పాల్గొన్నారు.

నేడు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పీసీపల్లి: స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు వెన్నుపోటు దినానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గుంటక తిరుపతిరెడ్డి

పామూరు: కనిగిరిలో బుధవారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య అన్నారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సీఎం చంద్రబాబు నాడు ఎన్నికల వేళ ప్రజలకు హామీలు ఇచ్చి ఏడాది పాలన పూర్తవుతున్నా హామీలను అమలు చేయకుండా గాలికి వదలేశారన్నారు. చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలను ప్రశ్నిస్తూ వైఎస్సార్ సీపీ వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమానికి ఉపక్రమించిందన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. వైస్ ఎంపీపీ ఏసురత్నం, కల్లూరి రామిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ చాంద్‌బాషా, అంబటి కొండారెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, గోవిందయ్య, చెనికల శ్రీను, గయాజ్‌బాషా, తాతపూడి రాము, శ్రీరాం శ్రీనివాసులు, మిరియం రామారావు, అనంతరెడ్డి, రంగారెడ్డి, తుపాకుల ఆంజనేయులు, ఎ.సత్యం రెడ్డి, ఎం.రాధాకృష్ణ, ఎం.మధు, పి.సూరి, బాలిరెడ్డి, పి.వెంకటనారాయణ, కె.రామసుబ్బారెడ్డి, టి.నాగేశ్వరరెడ్డి, థమ్సప్ మహబూబ్‌బాషా, జి.వెంకట నారాయణరెడ్డి, నక్కా మాల్యాద్రి, పాలేటి ప్రేమ్, సూరిపోగు మాల్యాద్రి పాల్గొన్నారు.

వెలిగండ్ల (కనిగిరి రూరల్): కూటమి సర్కార్ ఎన్నికల హామీలకు తూట్లు పొడిచి..రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిందని జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం సెంటర్‌లో సోమవారం వెన్నుపోటు దినం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను గుంటక తిరుపతి రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి



కొండపిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, నాయకులు

అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు సంక్షేమ పథకాలను పూర్తిగా విస్మరించారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ పథకాలకు సున్నం పెట్టారని ఘాటుగా విమర్శించారు. ఈ నెల 4న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపు నిచ్చారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్‌లు పొల్లా సుబ్రహ్మణ్యం, కాకర్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ గిద్దా బ్రహ్మయ్య, ఎలికా నారాయణ యాదవ్, మేడం ఆదిరెడ్డి, అనీల్‌కుమార్, ఆవుల తిరుపతిరెడ్డి, ఏటీఆర్, బొబ్బా వెంకటరెడ్డి, గంజి పరమేశ్వరరెడ్డి, మోడి నారాయణ యాదవ్, కోటయ్య, నన్నసాని నారాయణ, ఎస్‌కే కమాల్‌వలి, నరసయ్య, బాలస్వామి రెడ్డి, గోనా జేమ్స్, గజ్జల నాగిరెడ్డి, గంగయ్య, సుబ్బారెడ్డి, తగరం దేవసానం, సంగటి బాబు, డేవిడ్, చినబాబు, విమలమ్మ, గంజి రవీంద్రారెడ్డి, ఆదినారాయణ రమాణారెడ్డి పాల్గొన్నారు.

మర్రిపూడి: గత ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా ప్రజలను మోసం చేయడంపై వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయాలని పార్టీ మండల కన్వీనర్ ఇనుకొల్లు సుబ్బారెడ్డి కోరారు. సోమవారం రాత్రి మర్రిపూడి పడమటి బజారులోని కోదండరామ స్వామి ఆలయంలో వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 4న కొండపిలో నిర్వహించనున్న



మర్రిపూడిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇనుకొల్లు మాదిరెడ్డి, సన్నపురెడ్డి రామిరెడ్డి, ఇనుకొల్లు బసిరెడ్డి, ఐ.కృష్ణారెడ్డి, కొండూరి సుధాకర్‌రెడ్డి, మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇనుకొల్లు కృష్ణారెడ్డి, ఐ.వెంకారెడ్డి, వాకా హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కూటమి మోసాలు ఎండగట్టేందుకే..

కొండపి: కూటమి మోసాలను ఎండగట్టేందుకు ఈ నెల 4వ తేదీ ఉదయం 9:30 గంటలకు కొండపిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బచ్చల కోటేశ్వరరావు తెలిపారు. పార్టీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధ్యక్షతన జరిగే వెన్నుపోటు దినంలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముందుగా వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 365 రోజుల పాలనలో ఒక్క హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతోందన్నారు. హామీల అమలు కోసం కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి లక్ష్యంగా వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు. జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, రామయ్య, కొర్నెలు, రాఘవ, నారాయణ, నజీర్, మోహన్ పాల్గొన్నారు.

ప్రజలకు తప్పని రేషన్ కష్టాలు



సింగరాయకొండలోని కందుకూరు రోడ్డులో రేషన్‌షాపు వద్ద పడిగాపులు కాస్తున్న కార్డుదారులు



సింగరాయకొండలో మండుటెండలో రేషన్ బియ్యం మూటలు మోసుకుంటూ వెళ్తున్న మహిళలు, చిన్నారి



కొండపిలో సర్వర్ పనిచేయక రేషన్ దుకాణం వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

సింగరాయకొండ: రేషన్ వాహనాల రద్దుతో కార్డుదారులకు తిప్పలు తప్పడం లేదు. మండలంలో ఎటుచూసినా మండుటెండలో నెత్తిమీద మూటలు మోసుకుంటూ చిన్నాపెద్దా తేడాలేకుండా ముసలి వాళ్లు కూడా వెళ్తున్న ఘటనలే సోమవారం రెండోరోజు కనిపించాయి. వాళ్లలో ఎవరిని కదిలించినా గత ఐదు సంవత్సరాలుగా రేషన్ వాహనాలు తమ ఇళ్లకు వచ్చాయని, ఇప్పుడేమే షాపు నుంచి సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న ఇంటికి ప్రతినెలా మోసుకుపోవాలంటే కష్టమని చెబుతున్నారు. రేషన్ వాహనాలు రద్దు చేసిన కూటమి ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోస్తున్నారు. కందుకూరు రోడ్డులోని ఒక షాపు వద్ద అయితే ఉదయం 8 గంటలకు వచ్చి షాపు షట్టర్ ఎత్తి డీలర్ వెళ్లిపోయాడని, అతని కోసం అప్పటినుంచి వేచి చూస్తున్నామని 10 గంటల సమయంలో బాధితులు తెలిపారు. అక్కడి నుంచి సుమారు కిలోమీటరు దూరం తన ఇంటికి బియ్యం తీసుకుని వెళ్లాలని, తాను ఒంటరి మహిళ అని 75 సంవత్సరాల వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఒకవైపు కూటమి ప్రభుత్వ పెద్దలు 65 సంవత్సరాలు దాటిన వారికి, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే రేషన్ సరఫరా చేస్తామని చెబుతున్నా.. ఆచరణలో అమలు జరగడం లేదు. మండలంలో 2,789 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారని, ఎంతమంది ఇళ్లకు బియ్యం చేర్చారో చెప్పాలని, డీలర్లు ఇవ్వకపోతే తాము ఎవరికి మొరపెట్టుకోవాలో చెప్పాలని కార్డుదారులు వాపోతున్నారు.



పెదయిర్లపాడు రేషన్ దుకాణం వద్ద..

రేషన్ పంపిణీలో సర్వర్ కష్టాలు...

కొండపి: మండలంలో రేషన్ లబ్ధిదారుల సర్వర్ కష్టాలు అన్నీఇన్నీ కాకుండా ఉన్నాయి. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రేషన్ బండి ఇంటికే వచ్చి సరుకులు పంపిణీ చేసేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రేషన్ పంపిణీ వాహనాలను నిలిపివేసి రేషన్ దుకాణాలలోని సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల నుంచి ప్రారంభించడంతో గంటల తరబడి క్యూ లైన్‌లో ఉంటున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. చివరకు సర్వర్ సమస్య అని వెనక్కు పంపుతున్నారని సోమవారం రెండోరోజూ అలాగే జరిగిందని మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులు వాపోతున్నారు.

మొరాయించిన సర్వర్

పీసీపల్లి: రేషన్ షాపుల్లో రెండో రోజు కూడా ప్రజలు బియ్యం కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని రేషన్ షాపుల్లో సోమవారం కూడా గంటలు నిలబడి సర్వర్ సైతం మొరాయిస్తుండటంతో బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు గంటలు తరబడి ఏ పనికి వెళ్లకుండా ఒక రోజంతా వృథా అవుతోంది.

సుబ్బయ్య మృతి పార్టీకి తీరనిలోటు

పామూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొప్పాల సుబ్బయ్య (65) మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దూబగుంట్ల పంచాయతీ పడమటిపల్లె గ్రామానికి చెందిన కొప్పాల సుబ్బయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు ఆయన నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కల్లూరి రామిరెడ్డి, రాష్ట్ర గ్రీవెన్స్‌సెల్ సెక్రటరీ గట్లా విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు శ్రీరాం శ్రీనివాసులు, కందుల శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఉడుముల ఆదినారాయణరెడ్డి, రాచకొండ మహేంద్ర, కందుల శివరామిరెడ్డి, బత్తుల మస్తాన్ రెడ్డి, కె.రామనారాయణరెడ్డి ఉన్నారు.



సుబ్బయ్యకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాఠశాల పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

సీఎస్‌పురం (పామూరు): పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వమని జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం షేక్ ఖాదరున్నీసా బేగం అన్నారు. మండల కేంద్రం సీఎస్‌పురం జెడ్పీ హెచ్‌ఎస్‌లో 1999–2000 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని తోటివారితో పంచుకుని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలి

పీసీపల్లి: కూలీలందరికీ ఉపాధి కూలీ వెంటనే చెల్లించాలని సీపీఎం నాయకులు పీవీ శేషయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఉపాధి కూలీలతో ఆయన స్వయంగా మాట్లాడారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలంటే ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు వారానికి 200 నుంచి 500 వరకు డిమాండ్ చేస్తున్నారని ఆయన వద్ద కూలీలు వాపోయారు. పొద్దున 6 గంటల నుంచి 10 గంటల వరకు పని చేస్తుంటే కనీస వేతనం కూడా వేయకుండా డబ్బులు ఇస్తే గానీ వేయమంటూ కూలీలను ఇబ్బంది పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. మరోసారి ఇలా జరిగితే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

సీఎస్‌పురం ఎస్సైగా వెంకటేశ్వర నాయక్



వెంకటేశ్వర నాయక్

సీఎస్‌పురం (పామూరు): సీఎస్‌పురం ఎస్సైగా ఎం.వెంకటేశ్వరనాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న ఆర్.సుమన్ మెడికల్ లీవ్ పెట్టడంతో ఒంగోలు ఒన్‌టౌన్ ఎస్సైగా పనిచేస్తున్న వెంకటేశ్వర నాయక్‌ను సీఎస్‌పురం ఎస్సైగా బదిలీ చేశారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ

పామూరు: మండల కేంద్రం పామూరు ఆర్టీసీ బస్టాండ్‌ను నెల్లూరు ఆర్టీసీ రీజనల్ జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ ప్రాంతంలో సమస్యలపై స్థానిక సిబ్బంది, ప్రయాణికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కొండిశెట్టి వెంకటరమణయ్య పామూరు బస్టాండ్ సమీపంలో ఆర్టీసీకి చెందిన స్థలం ఉందని, ఆ స్థలంలో డిపో మంజూరు చేసి నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: కనిగిరి ఆర్టీసీ డిపోను ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. డిపోలోని వివిధ విభాగాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్యారేజ్ ప్రాంతంలో సీసీ రోడ్డుకు ప్రతిపాదనలు పంపిస్తే రవాణ శాఖ మంత్రితో మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. డిపో ప్రాంతంలో పరిశుభ్రతకు, పారిశుధ్య చర్యలకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. ప్రయాణికులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. డీఎం మొహ్మద్ సయాన బేగం, సిబ్బంది పాల్గొన్నారు.



పామూరులో సమస్యలు తెలుసుకుంటున్న సురేష్‌రెడ్డి

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో మేలు



కొండపిలో ఉత్పత్తులను విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు



టంగుటూరు: స్టాల్లో ఆహార ఉత్పత్తులు విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్

కొండపి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఏపీ సీఎన్‌ఎఫ్ మాస్టర్ ట్రైనర్ ఎస్తేరమ్మ అన్నారు. సోమవారం మండల కార్యాలయం వద్ద సేంద్రీయ పద్ధతులతో ఇలవర, పెట్లూరు, పెరిదేపి యూనిట్లలో పండించిన ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జులు మందాకిని, రంజిత్, మాధవ, ఐసీఆర్పీలు మాలకొండయ్య, ఏడుకొండలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ఆరోగ్యం

టంగుటూరు: ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఒక అడుగు ముందుకు వేశారు. మండలంలో రైతులచే ఇప్పటివరకు ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులు, లాభాలపై అవగాహన కల్పిస్తూ వచ్చిన ప్రకృతి వ్యవసాయ అధికారులు.. ఇప్పుడు గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే లక్ష్యంగా అడుగులు వేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన టంగుటూరు మండల కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్లో మండలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తీసుకొచ్చి ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ వెంకటరావు మాట్లాడుతూ ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం సుభాషిణి, ఏవో స్వర్ణలత సహకారంతో ప్రతి సోమవారం స్టాల్ ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు పద్మావతి, రమాదేవి, శ్రుతి, కవిత పాల్గొన్నారు.

ప్రతి కౌలు రైతుకు సాగు హక్కు పత్రాలు అందించాలి

టంగుటూరు: భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసే రైతులను గుర్తించి సాగు హక్కు పత్రాలు అందించాలని తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి స్వర్ణలత, తహసీల్దార్ ఆంజనేయులు, గ్రామ స్థాయి సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు పంటల సాగు హక్కు పత్రాల జారీపై సోమవారం జాయింట్ స్టాఫ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం టంగుటూరు మండలానికి 1325 పంట సాగు హక్కు పత్రాలు టార్గెట్గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. 11 నెలల కాల వ్యవధికి వాటిని ఇవ్వనున్నట్లు తెలిపారు. భూమిపై ఎలాంటి హక్కు కూడా కౌలు రైతులకు ఉండవని, భూ యజమానులు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా కౌలు రైతులకు అంగీకారం తెలిపి సాగు హక్కు పత్రాలు ఇవ్వడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, ఏఎస్ఓ వాణి, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాసరావు, ఎస్ వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

పొన్నలూరు: మండలంలోని ముప్పాళ్ల సమీపంలో పాలేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణాను అరికట్టాలని కోరుతూ జనసేన నాయకులు సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దార్ పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత ఇసుక మాటున కొందరు అక్రమార్కులు ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారన్నారు. పాలేరు నుంచి ఇష్టానుసారంగా ఇసుక రవాణా చేయడం వలన స్కీం బోరుల్లో నీళ్లు అడుగంటుతున్నాయని, దీనివలన పాలేరు నదీ ప్రవాహ ప్రాంత ప్రజలు తాగు, వాడుక నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భవిష్యత్‌లో కూడా నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. పాలేరులో ఇసుక రవాణాను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

టంగుటూరు: కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్ సమన్వయంతో ప్లాస్టిక్ వినియోగం వల్ల వచ్చే అనర్థాలు, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై సోమవారం టంగుటూరు టోల్ ప్లాజా వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. అందరిచే హరిత ప్రమాణం చేయించారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ వారి ప్రాంగణంలో మొక్కలు నాటించారు. జాతీయ రహదారి వెంట ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి టంగుటూరు గ్రామ వ్యర్థ నిర్వహణ కేంద్రం వద్ద అందజేశారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ జి.రాఘవరెడ్డి, వీరభద్రాచారి, వలంటీర్ ఎన్విరాన్‌మెంటర్ ఆర్గనైజేషన్, ప్రాజెక్ట్ హెడ్స్, సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్ ప్రతినిధులు కే శివకుమార్, జయరాం అమరబాబు, దేవీ సీ ఫుడ్స్ సిబ్బంది, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.



టంగుటూరు టోల్ ప్లాజా వద్ద మొక్కలు నాటుతున్న ప్రతినిధులు

విద్వేష పూరిత ప్రచారంపై కఠినంగా వ్యవహరించాలి

పామూరు: పెహల్గాంలో ఏప్రిల్ 22వ తేదీన 26 మంది పర్యాటకులను టెర్రరిస్టులు బలికొనగా దాన్ని కొందరు విద్వేష పూరితంగా మైనారిటీలపై రుద్దేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు అన్నారు. స్థానిక సెంయింట్ మార్క్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సోమవారం సమైఖ్యత సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ కొందరు ఉద్దేశపూర్వకంగా మైనారిటీలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆపరేషన్ సింధూర్ ఎప్పుడు ఆపాలి, ఎలా ముందుకు పోవాలి అనేది పూర్తిగా భారత ప్రభుత్వం నిర్ణయించాలికానీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడం మనదేశ సార్వభౌమత్వానికే ప్రమాదమన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు హనీఫ్, ఖాదర్‌బాషా, కొమ్మలపాటి మాల్యాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కందుకూరు డివిజన్

90102 24456

Office mail : sakshiongads@gmail.com